# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు



WANTED విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745





సంపుటి : 01 | సంచిక : 138 | వరంగల్ | గురువారం, 12 ఫిబ్రవరి 2026 | పేజీలు : 02




# ముగిసిన మున్సిపల్ పోలింగ్

**(కమ్మగాని రమేష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టు)**

జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీలలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా ఓటర్లు తమ ఓటు హక్కును వరుసలో నిల్చోని నియోగించుకున్నారు. పోలింగ్ తీరును ఎన్నికల పరిశీలకులు నరసింహరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేస్ కుమార్, డిసిపి రాజమహేంద్ర నాయక్ పర్యవేక్షించారు. ఓటర్లకు సహకరించారు. కేంద్రాలలో వసతులను సౌకర్యాలను పరిశీలించారు. జనగామలో కలెక్టర్ దంపతులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీలలో పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సుందరంగా అలంకరించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీలు, రాంపులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, అధికారులు, సిబ్బందితో పాటు సహకరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. రేపు లెక్కింపు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

## ■ అనుక్షణం పర్యవేక్షించిన కలెక్టర్, డీసీపీ










### సీపీను ఆకర్షించిన

## హరిత పోలింగ్ కేంద్రం

**పాలకుర్తి వాణి, హనుమకొండ :** మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సందర్శించారు. కేంద్రాన్ని అలంకరించిన తీరును పరిశీలించిన పోలీస్ కమిషనర్ ఆనందం వ్యక్తం చేస్తూ, పెండ్లి పందిరి మాదిరిగా అలంకరించినట్లుగా వుందన్నారు. హరిత పోలింగ్ కేంద్రం వద్ద ఇతర పోలీస్ అధికారులతో కలసి ఫోటో దిగారు.




### ఓటు హక్కు వినియోగించుకున్న

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి వాణి, తొర్రూరు : తొర్రూర్** మున్సిపల్ ఎన్నికల్లో 16వ వార్డులో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి గ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాధారణ ఓటరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి క్యూలో నిలబడి ఓటు వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి తన కట్టుబాటును మరోసారి చాటి చెప్పానన్నారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమె స్కూటీపై పోలింగ్ తీరును పరిశీలించారు.

# జనగామ జిల్లా.. అవార్డుల ఖిల్లా..

(ధీరావత్ శ్రీను నాయక్, సీనియర్ జర్నలిస్టు)

## జిల్లాకు విశిష్ట గౌరవం.. కలెక్టర్ కు విరివిగా అవార్డులు




చారిత్రక, పోరాటాల జనగామ జిల్లాకు ఎంతో విశిష్ట పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. జిల్లా పేరుతో పాటు పాలనాధికారి, కలెక్టర్, యువ అధికారి రిజ్వాన్ భాషా షేక్ పాలనలో తనదైన ప్రత్యేకత చాటుకుంటున్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నారు. పాలనతో పాటు అభివృద్ధిపరంగా ముందు ఉంచుతున్నారు.

**అందరితో మమేకం సమష్టి నిర్ణయాలు..**

కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అందరితో మమేకమవడం గొప్ప విషయం. అలాగే అధికారులతో కలిసి సమష్టి నిర్ణయాలు తీసుకోవడంలోనూ ఆయన ప్రత్యేకతను చూపుతారు. అందువల్లే జిల్లాకు ప్రత్యేక అవార్డులతో పాటు కొన్ని రంగాల్లో ముందుంటుంది మరి. ప్రత్యేక అవార్డులు, పురస్కారాలు సైతం దక్కాయి. ఇక 2026 జనవరి 24న ఎన్నికల నిర్వహణలో శిక్షణ, సామర్థ్యాభివృద్ధి అంశంలో చేసిన ఉత్తమ కృషికి గాను కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అవార్డుకు ఎంపిక అయ్యారు. రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డును కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ దిశా నిర్దేశంతో.. ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు ముందస్తుగా, నిరంతరంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించడం, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఎన్నికల నిర్వహణను అధికారులు సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించినందుకు ఈ అవార్డు అందజేశారు. గతంలోనూ కలెక్టర్ కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు, మూడు ప్రత్యేక అవార్డులను సైతం సొంతం చేసుకున్నారు.

**సక్సెస్ ఫుల్ గా విజయోస్తు కార్యక్రమం**

అంతేకాకుండా పదో తరగతి విద్యార్థుల శక్తి సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. విజయస్తు కార్యక్రమాలతో విద్యార్థులకు చేదోడు వాదోడుగా నిలుస్తూ అవగాహన కల్పిస్తున్నారు. మెరుగైన ఫలితాల సాధనకు నిరంతరంగా కృషి చేస్తున్నారు మన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్. అలాగే విద్యాభివృద్ధిలోనూ జిల్లా ప్రత్యేకతను చాటుకుంటుంది. ఈ అంశంలో కూడా జిల్లా, అధికారులకు అవార్డులు దక్కాయి.




## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** ఫ్రీ విల్ ఫౌండేషన్ కొంతకాలంగా విద్యార్థులకు చేయూతనందిస్తుంది. బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని చెన్నూరు, తొర్రూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 71 ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోడిశాల వినయ్ పంపిణీ చేశారు. పరీక్ష సామాగ్రి కూడా అందజేశారు. కార్యక్రమంలో పిడి అశోక్ కుమార్, సంస్థ చైర్మన్ కొడిశాల మానస, అడ్వైజర్ బాబు కొడిశాల, డీలర్ కొడిశాల శోభా రాణి, ప్రధాన కార్యదర్శి కొడిశాల పవన్ కళ్యాణ్, కోశాధికారి అలువాల నవీన్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.






## సోమేశ్వరస్వామి చిత్రపటం బహుకరణ

పాలకుర్తి వాణి, పాలకుర్తి : పాలకుర్తిలోని పుణ్యక్షేత్రమైన స్వయంభు శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఏదో ఒక రూపంలో ప్రతినిత్యం కానుకలు, బహుమతులు అందుతూనే ఉంటాయి. స్వామివారి చిత్రపటాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి భాగం లక్ష్మి ప్రసన్నకి పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన శ్రీ రాజరాజేశ్వర (R. R స్టూడియో) ప్రతినిధులు పన్నీరు సంతోష్ కుమార్, పన్నీరు శ్రీకాంత్ బహుకరించారు. వారి చొరవను ఈవో ప్రశంసించారు.



### 17న నిర్వహించే రిలే నిరాహార దీక్షను

# జయప్రదం చేయాలి

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** కల్లుగీత కార్మిక సంఘం పాలకుర్తి మండల కేంద్రంలో గౌడ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా గౌరవ అధ్యక్షులు కమ్మగాని నాగన్న గౌడ్, అధ్యక్షులు కమ్మగాని పరశురాములు గౌడ్, మండల కార్యదర్శి తాళ్లపల్లి మదర్ గౌడ్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 17 న హైదరాబాదులో నిర్వహించే రిలే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. గౌడ సంఘం సభ్యులందరూ మండలం నుంచి తరలి వెళ్లాలని సభ్యులు హాజరు కావాలని అన్నారు.

## మహా శివరాత్రికి 2,243 ప్రత్యేక బస్సులు

# 43 శైవ క్షేత్రాలకు సర్వీసులు

**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి పండుగ ఉండటంతో.. ఈనెల 14 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. అదేవిధంగా కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్‌లు, తాగునీటితోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17 తేదీ వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది.



Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341